# సుబ్బారావుకు తలతిరిగింది...

## -పి.ఎస్. రామచంద్రుడు

వెల్లకిలా పడుకొని సీలింగ్ కేసి చూస్తున్న సుబ్బారావుకి తల గిర్రున తిరిగింది. సీలింగ్ క్రిందికి వచ్చినట్టు, తను పడుకున్న మంచం పైకి వెళ్ళినట్టు అనిపించి భయంతో గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. గిరగిరా తిరుగుతున్నట్టు అనుభూతి.

"భవానీ...!" అని పెద్దగా అరిచాడు.

"ఏమయిందండీ ?" గాబరాగా పరుగెత్తుకొచ్చింది సుబ్బారావు భార్య భవాని.

"పట్టుకో...నన్ను గట్టిగా పట్టుకో!"

"ఛీ పోండి ... పట్టపగలు... ఇంకా వంటన్నా పూర్తి కాలేదు ...!" సిగ్గు పడుతూ చెప్పింది భవాని.

"భవానీ..." కణతలు గట్టిగా నొక్కుకుంటూ బాధగా అన్నాడు. "తల తిరుగుతుంది. నాకేమయిందో తెలియటం లేదు. నా తలలో ఎవరో దూరారుచూడు" తల గట్టిగా పట్టుకొని జుట్టు పీక్కుంటూ పిచ్చోడిలా అరిచాడు.

భవానీకేమీ అర్థం కాలేదు. రిక్షా పిలిచి ఫ్యామిలీ డాక్టర్ గోవిందరావు దగ్గరికి తీసుకెళ్ళింది.

"డాక్టరుగారూ నా తలలో ఎవరో దూరారండీ!" ఆందోళనగా చెప్పాడు సుబ్బారావు.

"తలలో దూరటమేమిటి ?" ఆశ్చర్యంగా అడిగాడు గోవిందరావు.

"యస్ ... పడుకుంటే గదంతా గిర్రున తిరుగుతుంది."

"హెలూసినేషన్ ... !" అన్నాడు డాక్టర్. "రాత్రి ఏదన్నా దెయ్యాలకథ చదివావా ?"

"నో జోక్స్ డాక్టర్ ... ఐయామ్ సీరియస్ !" అన్నాడు సుబ్బారావు.

'ఒన్ మినిట్...భవానీ ఇలారామ్మా!' లోపలికి పిలుచుకు వెళ్ళాడు డాక్టర్. "ఈ మధ్యలో ఏమయినా షాకింగ్ న్యూస్ విన్నాడా ... సుబ్బారావు చాలా సెన్సిటివ్, నాకు తెలుసు !"

"ఏమీలేదండీ !"

"బాగా గుర్తుతెచ్చుకోమ్మా ... వీక్ నెస్సా అనుకుంటే సుబ్బారావు ఎప్పుడు చూసినా అప్పుడే భోంచేసినట్టు నిండుగా వుంటాడు. శారీరకంగా ఏలోపం లేదు. మానసికంగా ఏదయినా జరిగుండాలి."

"గుర్తొచ్చిందండీ! వారం క్రితం ఆయనకి శివాజీకి మధ్య డిస్కషన్ జరిగింది."

"శివాజీ ఎవరు ?"


"మావారి కొలీగ్...!"

"ఐ.సీ...దేన్ని గురించి డిస్కషన్"

"కమలహాసన్ మంచి నటుడని మావారు, కాదు చిరంజీవి గొప్ప నటుడని శివాజీ సీరియస్‌గా వాదించుకున్నారు. అది తీవ్రమయి దాదాపు కొట్టుకోబోయారు కూడా. నేనే అడ్డుపడి విడదీశాను. ఆ తరవాత మా ఆయన్ని మందలించాను. శివాజీ నామీద చెయ్యెత్తేటంత మగాడా ? అని రోజూ రెండు మూడుసార్లు కోపంగా నా దగ్గర అంటున్నారు యిప్పటికీ. అంతకి మించి ఏమీ జరగలేదు."

ఆలోచించాడు డాక్టర్ గోవిందరావు. అర్థమయిందన్నట్టు తలూపి బయటికొచ్చాడు.

"చూడు బాబూ సుబ్బారావు ... నీకు జబ్బేమీ లేదు. హాయిగా నిదరబోతే చాలు" అన్నాడు.



"డాక్టర్... నాకు తల తిరుగుతుంది అని చెబితే, జబ్బు లేదంటున్నారు ఏమిటండీ!" అడిగాడు సుబ్బారావు.

"అవునయ్యా! తల తిరగటం పెద్ద జబ్బేమీ కాదు. దానికి మందులిస్తాను" ప్రిస్క్రిప్షన్ రాసిచ్చాడు. "భోజనం చేయగానే 'జెల్యూసిల్' టాబ్లెట్లు రెండు చప్పరించు. పడుకోబోయేముందు 'వాలియం 5' టాబ్లెట్ ఒకటి వేసుకో..."

"వెళ్ళివస్తాను సార్... ఈ మందులు వాడాక మళ్ళీ కలుస్తాను" సెలవు తీసుకొని బయటికొచ్చాడు సుబ్బారావు భవానీతో కలిసి. వారం రోజులు మందులు వాడాడు. తల తిరగటం తగ్గలేదు.

గుంటూరు వచ్చి డాక్టర్ రామ్మూర్తిని కలిశాడు. ఆయన సుబ్బారావుని పరీక్షించి మెడిసిన్స్ యిచ్చాడు. అవి తీసుకుని చీరాల వచ్చి వాడటం మొదలెట్టాడు. నెల గడిచింది. తల తిరగటం తగ్గలేదు. సడన్‌గా ఒక అనుమానం మొదలయింది సుబ్బారావుకి. అది క్రమేణా బలపడింది. నో డౌట్... శివాజీగాడిపనే యిది. వాడికి క్షుద్ర శక్తులమీద నమ్మకముంది. కాబట్టి నా తలకి చేతబడి చేయిందుంటాడు.

"భవానీ...!" పెద్దగా అరిచాడు. వచ్చింది.

"అర్జెంటుగా రిక్షా పిలువు..."

"ఎందుకండి?" అనుమానంగా అడిగింది భవాని.

"పిలువ్..."

రిక్షా పిలిచింది భవాని. ఇద్దరూ ఎక్కారు. 'భూత, ప్రేత పిశాచాలని తోలబడును - భయంకర్,' బోర్డు చూసి రిక్షా ఆపించి లోపలికి వచ్చాడు సుబ్బారావు. భవానీకి అంతా అయోమయంగా ఉంది.

"భం భం బటక్... నీవు మానసికంగా బాధపడుతున్నావు అవునా?" అడిగాడు భయంకర్.

బోర్లా ఆయన కాళ్ళమీద పడ్డాడు సుబ్బారావు. "సార్... నా భార్యని కాపాడండి సార్..." అన్నాడు.

"ఏమయిందమ్మా నీకు?" అడిగాడు భయంకర్.

భవానీకి ఏడుపు వచ్చింది.


"అయ్యా... మీరు మహామాంత్రికులని విని వచ్చాను. నా తలకి శివాజీ అనేవాడు 'చేతబడి' చేయించాడని నా అనుమానం. దానిని తిరగగొట్టి మా ఆవిడ్ని కాపాడండి. 'నా భార్యని దిక్కులేనిదాన్ని చేయకండి. నన్ను బ్రతికించండి!" దీనంగా వేడుకున్నాడు సుబ్బారావు.

"అర్థమయింది ఢింబకా..." పీట మీద కూర్చోబెట్టి ధూపం వేశాడు భయంకర్.

ఉక్కిరి బిక్కిరయ్యాడు సుబ్బారావు. తల మళ్ళీ తిరిగింది. "ఇదే... ఇదే నా జబ్బు!" అని అరిచాడు.

భవానికి భయమేసింది. మంగళసూత్రం తీసి కళ్ళకద్దుకుంది. అరగంటసేపు అర్థంకాని మంత్రాలన్నీ భీకరంగా చదివాడు భయంకర్. మెడలో ఒకటి, రెండు చేతులకీ రెండు తాయెత్తులు కట్టి, సుబ్బారావు నెత్తిమీద రెండు నిమ్మకాయలు కోసి పిండాడు. "ఢింబకా, యింటికెళ్ళి తలస్నానం చెయ్యి. రోజూ రెండు పూటలు "ఓం క్రీం భయంకర్" అనే మంత్రం పదిహేను నిముషాలు జపించు.






భం భం బటక్" అని సుబ్బారావు తల మీద చెయ్యి పెట్టి ఆశీర్వదించాడు.

రెండువందల పదహారు రూపాయలు ఫీజు చెల్లించి భక్తిగా ఆయనకి నమస్కరించి ఇంటికొచ్చారు.

ఇంకో నెల గడిచింది సుబ్బారావుకి తల తిరుగుడు తగ్గలేదు. తాయెత్తులు చూసినప్పుడల్లా సిగ్గు పడుతున్నాడు. ఎడ్యుకేటెడ్ అయ్యుండి తను కూడా మాంత్రికుడి దగ్గరకెళ్ళి తాయెత్తులు కట్టించుకున్నాడంటే అవమానంగా వుంది. అట్లాగని పీకేద్దామా అంటే భయమేస్తుంది. తరవాతేమన్నా జరిగితే?

భవానీకి దిగులు ఎక్కువయింది. ఎందుకు ఆయనకి అలా జరుగుతుంది. ఆయనకి త్వరగా నయమయితే విజయవాడ 'కనక దుర్గమ్మ' గుడికి ఏడు శుక్రవారాలు వస్తానని మొక్కుకుంది.

ఆదివారం ఆఫీసు స్టాఫ్ అంతా వచ్చారు సుబ్బారావు ఇంటికి. టైపిస్టు సరోజ సానుభూతిగా భవానీని పలుకరించింది.

"పాపం.... మంచివాళ్ళకే ఇలాంటివి జరుగుతయి. దిగులు పడకండి. హైదరాబాద్‌లో స్పెషలిస్టు ఒకాయన ఉన్నారు. ఆయనకి చూపించండి" అని చెప్పి అడ్రస్ యిచ్చింది.

హైదరాబాద్ వచ్చి స్పెషలిస్టుని కలిశారు.

కుడి చెవిలో ఒక సన్నటి రబ్బరు గొట్టాన్ని దూర్చి అడిగాడు డాక్టరు "ఎలా వుంది?"

"కొంచెం నొప్పిగా వుంది సార్!" అన్నాడు సుబ్బారావు.

"భరించలేనంతగానా?"

"అబ్బే అంత యిదిగా కాదు!" చెప్పాడు సుబ్బారావు.

రబ్బరు గొట్టం బయటికితీసి ఎడమ చెవిలో దోపాడు డాక్టరు. మళ్ళీ తల తిరిగినట్లయింది సుబ్బారావుకి.

"ఇప్పుడెలా వుంది?" అడిగాడు డాక్టర్.

"తలలో సముద్రం పొంగుతున్నట్లు నేను పిచ్చివాడిని అయిపోతున్నట్లు వుంది డాక్టర్!" బాధగా చెప్పాడు సుబ్బారావు.

"ఊ..." తలపంకించాడు డాక్టర్ అబిడ్స్‌లో స్కానింగ్ సెంటర్ అడ్రసు యిచ్చి "స్కాన్" తీయించమన్నాడు.

స్కాన్ తీయించాడు సుబ్బారావు.

మొత్తం పరిశీలించాడు డాక్టర్. "ఒక పదిరోజులకి మెడిసిన్స్ రాస్తున్నాను. వాడిన తరువాత కనిపించండి!" ప్రిస్క్రిప్షన్ యిచ్చి చెప్పాడు.

చీరాల వచ్చి మందులు కొన్నాడు సుబ్బారావు రెండురకాల టాబ్లెట్లు. వాటిని చూడగానే యింతకు ముందు 'వాడానే' అనుకున్నాడు. ప్రిస్క్రిప్షన్ని మళ్ళీ చూశాడు జెల్యూసిల్, వాలియం-5. తన ఫ్యామిలీ డాక్టర్ గోవిందరావు మొట్టమొదట రాసిన టాబ్లెట్స్.

మోసం, దగా... అనుకున్నాడు సుబ్బారావు. చెవులో గొట్టాలుపెట్టి, తలకాయకి ఫొటోలు తీయించి వేలు వేలు ఖర్చు పెట్టించి పెద్ద డాక్టరు యిచ్చిన మాత్రలు, అయిదు రూపాయలు కన్సల్టింగ్ ఫీజు తీసుకొని గోవిందరావు ఇచ్చిన మాత్రలు ఒకటే. కాబట్టి గోవిందరావే మంచి డాక్టరు అనుకొని ఇంటికొచ్చాడు సుబ్బారావు. ఆ రాత్రి మళ్ళీ తల తిరిగింది సుబ్బారావుకి. పొద్దున్నే గోవిందరావు దగ్గరికి వచ్చాడు.

"తల తిరుగుడు తగ్గలేదుసార్...." చెప్పాడు.

"వ్వాట్...ఎప్పుడో మూడు నెలల క్రితం వచ్చావు. మెడిసిన్స్ యిచ్చాను. మళ్ళీ కనిపించక పోయేసరికి తగ్గిందేమో అనుకున్నాను" స్టెతస్కోపుతో పరీక్ష చేస్తూ అన్నాడు. "ఇదేంటి?" అడిగాడు మెడలో తాయెత్తు చూపిస్తూ.

సిగ్గుపడ్డాడు సుబ్బారావు.

"ఓహో.... మందులు మానేసి మాంత్రికుడి దగ్గిర కెళ్ళావన్నమాట?"

తలెత్తలేదు సుబ్బారావు.

"నిన్ను చూస్తుంటే జాలేస్తుందయ్యా!" భుజం తడుతూ చెప్పాడు. "ఒక డాక్టర్గా నేను నీకు సలహా యివ్వకూడదు. అయినా ఫ్రెండ్లీగా చెబుతున్నాను. ఎప్పుడన్నా తల తిరుగుతుంది అనిపిస్తే ఓ పెగ్ బ్రాందీతాగు."

ఆశ్చర్యంగా చూశాడు సుబ్బారావు. "బ్రాందీనా?"

"అవును మెంటల్ టెన్షన్ తగ్గిస్తుంది. అలాగని రోజూ త్రాగి అలవాటు చేసుకోకు. ఒన్స్ యిన్ ఏ బ్లూమూన్ ఒక పెగ్ అంతే!"

సుబ్బారావు ఒక క్వార్టర్ బ్రాందీ కొనుక్కొని యింటికి వచ్చాడు, బాటిల్ ఓపెన్చేసి గ్లాసులో కొంచెం పోసి నీళ్ళు కలిపి "భవానీ.... కాసిని వడియాలు వేయించి తీసుకురా!" అన్నాడు.


"వడియాలా! ఇప్పుడు వడియాలెందుకండీ?" అని వంటగదిలోంచి బయటికొచ్చి చూసిన భవానీకి తల గిర్రున తిరిగింది. "ఏమండీ జబ్బు నయం కాకపోతే అమెరికా వెళ్ళి చూపిద్దాము. మా పుట్టింటినుంచి డబ్బు తెప్పిస్తాను. అంతే గాని మీరు ఈ పని మటుకు చేయకండి!" భోరున ఏడ్చింది భవాని.

తల తిరిగింది సుబ్బారావుకి. గ్లాసు ఎత్తి గటగటా తాగేసి ఫక్కున నవ్వి "డాక్టర్ తాగమన్నాడు భవానీ" అన్నాడు.

"డాక్టరు బ్రాందీ తాగమన్నాడా?" ఆశ్చర్యంగా అడిగింది కళ్ళు తుడుచుకుంటూ భవాని.

"అవును ఎప్పుడన్నా ఒకసారి టానిక్లాగా తీసుకోమన్నాడు! అంతేగానీ నాకు






యుదంటే ఎలర్జీ అని నీకు తెలియదా ?"

ఇంకోనెల గడిచింది. బ్రాందీ తాగుతున్నా తల తిరుగుడు తగ్గలేదు సుబ్బారావుకి. పెగ్గునుంచి క్వార్టర్ తాగే స్థితికి చేరుకున్నాడు. తాగినప్పుడల్లా శివాజీ కనిపిస్తున్నాడు. కత్తి తీసుకుని పొడిచేద్దామా శివాజీని అనిపిస్తుంది. తను జైలుకెళితే భవానీకి అన్యాయం చేసిన వాడినవుతానేమో అనుకుంటాడు. అలా అనుకోగానే సీలింగు కిందకి, మంచం పైకీ వెసతుంది.

ఓరోజు చిన్ననాటి స్నేహితుడు రామారావు చీరాల వచ్చి భవానీని, సుబ్బారావుని చూసి ఆశ్చర్య పోయాడు. రామారావు విజయవాడలో మెడికల్ రిప్రజెంటేటివ్.

"ఏమిట్రా దుక్కలా వుండేవాడివి. ధూదలా అయిపోయావు !" అడిగాడు సుబ్బారావుని.

భోరుమని ఏడ్చాడు సుబ్బారావు. భవానీకూడా ఏడ్చింది.



రామారావుకి తల తిరిగింది. "ఏం జరిగింది చెప్పరా.... ఎందుకిలా అయిపోయావు !"

"తెలియదు. ఏం చెప్పాలి ? డాక్టర్లేమో జబ్బేమీ లేదంటారు. మాంత్రికుడేమో తాయెత్తులు కట్టాడు .... !" దిగులుగా చెప్పాడు సుబ్బారావు.

అర్థం కాలేదు రామారావుకి. "అసలు సంగతి ఏంటి? డాక్టరు దగ్గరికి, మాంత్రికుడి దగ్గరకి ఎందుకెళ్ళావు ?" అయోమయంగా అడిగాడు.

జరిగిందంతా చెప్పాడు సుబ్బారావు.

సుబ్బారావుని తీసుకొని మద్రాసు వచ్చాడు రామారావు. ప్రఖ్యాత న్యూరో సర్జన్ 'నటరాజన్' దగ్గరకి తీసుకెళ్ళి చూపించి విషయమంతా చెప్పాడు.

పాత రిపోర్టులన్నీ చూశాడు నటరాజన్. సుబ్బారావుని టెస్ట్ చేసి "నీకు జబ్బులేదు !". అన్నాడు.

సుబ్బారావు ఆనందంగా చూశాడు. "సార్ ఇఫ్ యూ డోంట్ మైండ్...ఒక చిన్న డౌట్ ?"

అడగమన్నాడు నటరాజన్. రామారావుని ఇబ్బందిగా చూశాడు సుబ్బారావు. 'ఇట్స్ ఓకె' అని రామారావు బయటికెళ్ళాడు.

చెప్పమన్నట్లు చూశాడు డాక్టర్ నటరాజన్.

"సార్ ..." సిగ్గుపడుతూ అడిగాడు సుబ్బారావు. "నేను సంసారం చేయవచ్చా ?"

"వ్వాట్...." తల తిరిగింది నటరాజన్‌కి. "సంసారం చేయవచ్చా ... ! వాట్ డూయూమీన్..."

"...తిరుగుతున్నప్పట్నుంచి ...
...రు..." దిన్నగా చెప్పాడు సుబ్బారావు.

"...యనా సుబ్బారావు...అర్జెంటుగా ...టారు మీ ఆవిడకి న్యాయం ...రు. నీకు జబ్బేమీ లేదు ....!"

"...రా సుబ్బా! నీ డౌట్స్ అన్నీ ...ర్ అయ్యాయా ?" బయటికొచ్చిన ...బ్బారావు నడిగాడు రామారావు.

"...హా..." అన్నాడు సుబ్బారావు. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో చీరాల ...టారు. ఆరోజు మొదటిరాత్రి గుర్తొచ్చింది సుబ్బారావుకి, భవానీకి.

...ద్దున్నే నిద్రలేచిన సుబ్బారావుకి ...ట్సే తల గిర్రున తిరిగింది. రామారావు ...గానే చెప్పాడు. తిరగబోతున్న తల...ని గట్టిగా పట్టుకున్నాడు రామారావు. ...రోజు వెంటనే వెళ్ళి శివాజీని కలిసి ...డి సుబ్బారావు దగ్గరికి తీసుకొచ్చారు.

"సుబ్బారావు....కమలహాసన్ మంచి నటుడు ఒప్పుకుంటాను. అనవసరంగా ...స్సపిల్లల్లా కొట్టుకోబోయాం ....!" అన్నాడు శివాజి.

"చిరంజీవికూడా మంచి నటుడే !" చెప్పాడు సుబ్బారావు. వెంటనే తలలోంచి ఏదో బరువు గాలిలోకి వెళ్ళిపోయినట్లు అనిపించింది. ఆ తరవాత సుబ్బారావుకి తల తిరగలేదు.

'అమ్మయ్య ! సుబ్బారావుకి నయమయింది' విజయవాడ వచ్చాక పడుకొని ఆలోచిస్తూ అనుకుంటున్న రామారావుకి సడన్‌గా సీలింగ్ కిందకి, మంచం పైకి వెసరుతున్నట్లు అనిపించింది. •••

